# అభివృద్ధిలో వెల్దుర్తి సొసైటీ ఆదర్శం


వెల్దుర్తిలో డీసీసీబీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

- పెరిగిన డీసీసీబీ లావాదేవీలు
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి
- బ్యాంకు భవనం, దుకాణాలు, గోదాంలు ప్రారంభం

వెల్దుర్తి, అక్టోబర్ 8: అభివృద్ధిలో వెల్దుర్తి సహకార సంఘం ఆదర్శంగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతాలక్ష్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దుర్తి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన డీసీసీబీ భవనం, దుకాణ సముదాయం, శెట్‌పల్లిలో 1500 మెట్రిక్ టన్నులు, బండపోసాన్‌పల్లి, దామరంచ గ్రామాల్లో 400 మెట్రిక్ టన్నుల గోదాంలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.400 కోట్ల లావాదేవీలతో ఉన్న మెదక్ డీసీసీబీ రాష్ట్రంలో రూ.2100 కోట్లకు చేరిందన్నారు. ఈ బ్యాంకుల్లో ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌తో పాటు ఆన్‌లైన్ లావాదేవీలు, యూపీఐ పేమెంట్‌లు, ఏటీఎంల సేవలను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సేవలు అందించడమే బ్యాంకు ఉద్దేశమన్నారు. ఈ బ్యాంకులో విద్య, ఉపాధితో పాటు కోళ్ల ఫారాలు, డెయిరీ ఫాంలు, దుకాణాలు, గోల్డ్ లోన్‌ను సైతం తక్కువ వడ్డీకి ఇచ్చి, మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తే ఎక్కడైనా ఉపయోగిస్తారని, డీసీసీబీ డిపాజిట్ చేస్తే జిల్లాలోనే వినియోగిస్తారని అన్నారు. సహకార సంఘం ద్వారా వెల్దుర్తిలోనే కాకుండా మండలంలోని చాలా గ్రామాల్లో గోదాంలు నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చి, ప్రభుత్వం ఆధ్వర్యంలో సకాలంలో ఎరువులు, విత్తనాలను అందించి, రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఎండాకాలంలో సైతం హల్దీవాగులో కాళేశ్వరం జలాలు ప్రవహించడంతో వెల్దుర్తి మండలంలో సమృద్ధిగా పంటలు పండి భారీగా ధాన్యం వస్తున్నదన్నారు. ధాన్యానికి అనుగుణంగా గోదాంలు నిర్మించడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి తెలంగాణ సర్కారు సహాయ సహకారాలు అందించడమే కాకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అదర్శంగా నిలుస్తున్నదన్నారు. అనంతరం మల్లన్న గుట్ట వద్ద నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు మురళి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణాగౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పడిగె నర్సింలు, రమేశ్‌గుప్తా, శ్రీధర్‌గుప్తా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా పత్రం అందజేస్తున్న గొల్పర్తి కుమ్మరి సంఘం

# బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

- సీఎం కేసీఆర్ ముందు ఎవరి పాచికలు పారవు
- గొల్పర్తి గ్రామంలోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో 50 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక

రామాయంపేట, అక్టోబర్ 8: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీదే హవా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పక్షాలకు దిమ్మదిరిగేలా వలసలు పెరుగుతున్నాయని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గొల్పర్తి గ్రామం నుంచి కుమ్మరి సంఘానికి చెందిన 50 కుటుంబాలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించి, మద్దుతు పత్రాన్ని అందజేశారు. అనంతరం మండలంలోని కాట్రియాల గ్రామంలో నుంచి రెండు వందల బైకులతో ర్యాలీగా వచ్చి బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు పలికారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీదే గెలుపు ఖాయమన్నారు. ఇప్పటికే ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా బీఆర్‌ఎస్‌లో ఆ పార్టీ నాయకులు వచ్చి చేరడంతో వారి మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి, కామారెడ్డిలో షబ్బీర్ అలీ, బీజేపీ నాయకులు వారి ఇండ్లలో కూర్చుని పిచ్చికూతలు కూస్తున్నారే తప్పా వారితో తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ముందు ఏ పార్టీకి తెలంగాణలో స్థానం లేదన్నారు. మన పద్మక్క హ్యాట్రిక్ సాధించబోతున్నదన్నారు. రామాయంపేట పురపాలిక గొల్పర్తి, కాట్రియాల గ్రామస్తులు బైక్ ర్యాలీతో వందలాదిగా రామాయంపేటకు చేరుకుని మద్దతు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, మల్యాల కవిత, కాట్రియాల సర్పంచ్ మైలారం శ్యాంలు, ఉపసర్పంచ్ స్రవంతి రాజేందర్ ఉన్నారు.

# ప్రగతి పథంలో కిషన్‌తండా

- రూ.కోటి 20 లక్షలతో అభివృద్ధి పనులు
- తండా ప్రత్యేక పంచాయతీ కావడంతో మరింత అభివృద్ధి


తండాలోని కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు


మన ఊరు- మనబడిలో భాగంగా స్కూల్ చుట్టూ నిర్మించిన ప్రహరీ

రామాయంపేట రూరల్, అక్టోబర్ 8: గతంలో ఆ గిరిజన తండా అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేంది. గత ప్రభుత్వాలు తండాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. ప్రభుత్వ పథకాలు కూడా అందేవి కావు. ఆ పంచాయతీ పరిధిలో రెండు మూడు తండాలు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో రామాయంపేట మండలంలోని కిషన్ తండా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగి, ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నది. కిషన్ తండాలో ఒకప్పుడు రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు సరిగ్గా ఉండని దుస్థితి. నేడు సీఎం కేసీఆర్ ఇచ్చిన నిధులతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అధిక నిధులు కేటాయించడంతో పాటు తండాల అభివృద్ధికి కృషి చేయడం, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తన నిధులు నుంచి అభివృద్ధికి సహకరించడంతో ఈ తండా ఆదర్శంగా మారింది.

**గ్రామంలో రూ.కోటి 20 లక్షలతో అనేక పనులు**

కిషన్ తండాలో రూ.35 లక్షలతో సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులు, రూ.11.05 లక్షలతో స్కూల్ ప్రహరీ, మనఊరు- మనబడిలో భాగంగా రూ.4.50లక్షలు మంజూరయ్యాయి. రూ.5 లక్షలతో టాయిలెట్లు నిర్మించారు. రూ.12 లక్షలతో వైకుంఠధామం, రూ.2.50 లక్షలతో డంపింగ్‌యార్డు, రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం, రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాని రూ.15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పంచాయితీ నిధుల నుంచి గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుంటున్నారు. మిషన్ భగీరథ నీటితో తండాలో తాగునీటి సమస్య తీరింది. ఈసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకుంటామని తండావాసులు చెబుతున్నారు.


మిషన్ భగీరథ నీరు పడుతున్న మహిళ


చెత్త డంపింగ్ యార్డు

**ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉంది**



మా తండా అభివృద్ధిలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సహకారంతో ఎంతో ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోపాటు సొంత నిధులు కేటాయిస్తూ ఎమ్మెల్యే చాలా సహకరించారు. తండా అభివృద్ధికి ఏ పని అడిగినా నిధులు మంజూరు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ దయతో తండాల జీవన విధానం మారింది. ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడి అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. సీఎం సారుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– సుభాష్ రాథోడ్, సర్పంచ్ కిషన్ తండా

## రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు
# మెదక్ జిల్లా క్రీడాకారులు ఎంపిక


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన మహిళా క్రీడాకారులు

చేగుంట, అక్టోబర్ 8: రాష్ట్రస్థాయి అండర్ 17, 19 రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ కరణం గణేశ్ రవి కుమార్ తెలిపారు. చేగుంటలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 200 మంది క్రీడకారులు పాల్గొన్నారు. ఒకో జట్టుకు 12 మంది చొప్పున ఎంపిక చేశారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో అండర్ 17 బాలబాలికలు పాల్గొంటారు. 13, 14, 15 తేదీల్లో తొర్రూర్‌లో జరిగే క్రీడలో క్రీడకారులు పాల్గొంటారని కోచ్ తెలిపారు. కార్యక్రమం లో పీడీ వెంకటేశ్, వనిత, శ్రీనాథ్, మల్లీశ్వరి, ఉమారాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

# పిల్లర్ గుంతలో పడి బాలుడి మృతి

రామాయంపేట, అక్టోబర్ 8: పిల్లర్ గుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్‌లో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. నరేశ్–మౌనికల మొదటి కుమారుడు దీక్షత్ (7) మధ్యాహ్నం అన్నం తినడానికి రాకపోవడంతో తల్లిదండ్రులు, వారి బంధువులు ఊరంతా వెదికారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఇంటి దగ్గరలోని పంచాయతీ బిల్డింగ్ నిర్మాణం కోసం తీసిన గుంతలో కర్రలతో గాలించారు. దీంతో బాలుడి మృతదేహం కనిపించింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.